కొత్తూరు చెరువు కబ్జా

- 80 ఎకరాల్లో ఉన్న చెరువులో 50 ఎకరాల ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు


శేషాపురం కొత్తూరు చెరువు


అక్రమణలకు గురైన స్థలం

రొద్దం: వాగులు, వంకలు, చెరువులు, గుట్టలు వేటినీ వదలడం లేదు అక్రమార్కులు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమించేస్తున్నారు. మండలంలోని కలిపి గ్రామ పంచాయతీ శేషాపురం గ్రామానికి చెందిన కొత్తూరు చెరువు ఆక్రమణకు గురైంది. 748 సర్వే నంబర్‌లో 80 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు కాస్తా 30 ఎకరాలకు వచ్చింది. ఏకంగా 50 ఎకరాలను కబ్జా చేసేశారు. చెరువు స్థలాన్ని కబ్జాదారులు మింగేస్తున్నా అధికారులు కూడా పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. చెరువు స్థలం కుంచించుకుపోతుండటంతో గ్రామ రైతులు ఆందోళన చెందుతున్నారు. కబ్జాకు గురైన చెరువు స్థలాన్ని కాపాడాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు రైతులు విన్నవించారు. రెవెన్యూ సదస్సులో కూడా తహసీల్దార్‌కు రైతులు వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకుని కబ్జాదారుల చెర నుంచి చెరువును రక్షించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

చెరువును కాపాడాలి



గత కొన్నేళ్లుగా శేషాపురంలోని కొత్తూరు చెరువును కొందరు అక్రమార్కులు ఆక్రమించారు. 80 ఎకరాల్లో ఉన్న చెరువు కాస్తా ఇప్పుడు 30 ఎకరాలకు లోపడి వచ్చింది. చెరువు చుట్టు పక్కల ఉన్న వారు చెరువును చెరపడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలకు గురైన చెరువును రక్షించాలి. – రామచంద్రారెడ్డి, శేషాపురం

అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి



ఆక్రమణలకు గురైన కొత్తూరు చెరువును అధికారులు కాపాడాలి. అనేక ఏళ్లుగా చెరువు ఆక్రమణలకు గురి కావడంతో చెరువు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించాలి. అక్రమార్కులపై గట్టి చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే చెరువు ఆక్రమణలపై అధికారులకు రైతులందరూ కలసి ఫిర్యాదు చేశాము. – జగనాథ్‌రెడ్డి, రైతు, శేషాపురం

విద్యుత్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట


పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక


పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప

- 27న నియోజకవర్గ కేంద్రాల్లో పోరుబాట ర్యాలీ
- అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు టీఎన్ దీపిక, ఈరలక్కప్ప

హిందూపురం టౌన్: విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం చార్జీలను పెంచడం దారుణమని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 27న హిందూపురం పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన తెలుపనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. దీపిక మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే బాదుడు గ్యారంటీ అన్నారు. ట్రూ అప్‌చార్జీలు, సర్దుబాటు చార్జీలంటూ రూ.కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన మోపడం అన్యాయమన్నారు. విద్యుత్ చార్జీల పెంపు పేదల పాలిట శాపంగా మారిందన్నారు. చార్జీల మోతను ఖండిస్తూ చేపట్టనున్న పోరుబాట కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వీ శివ, పట్టణ, మండల అధ్యక్షులు మస్సూర్, రాము తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: నియోజకవర్గ కేంద్రమైన మడకశిరలో ఈనెల 27న పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన మంగళవారం వైఎస్సార్ సర్కిల్‌లో పోరుబాట పోస్టర్లను మాజీ మంత్రి నర్సేగౌడుతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలను పెంచి ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ధ్వజమెత్తారు. పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, కౌన్సిలర్లు విక్రమ్, అన్సర్‌ఖాన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, కరియన్న, నరసేగౌడు, రంగనాథ్, మల్లికార్జున, తిప్పేస్వామి, రవికుమార్, నరసింహ, లక్ష్మీనారాయణ, శివానంద్, బాషా, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వాహన రాకపోకలు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లి గ్రామంలోని మక్కాజిపల్లి తండా దారిలో ఏర్పాటు చేసిన గ్రీన్ టెక్ పరిశ్రమలోకి వాహనాలు రాకుండా గుర్తుతెలియని వ్యక్తులు అడ్డుకుంటున్నారని పరిశ్రమ మేనేజర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కియా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రొళ్ల ఎస్‌ఐగా వీరాంజనేయులు

రొళ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నూతన ఎస్‌ఐగా వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించనున్నారు. తిరుపతి జిల్లా కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు రొళ్లకు బదిలీ చేశారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్టాపన

మడకశిర: పట్టణంలోని స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన, మండల పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

అమరాపురం: మండలంలోని బంగారుపాళ్యం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న బెనవన్న స్వామి ఆలయ ఆవరణలో బుధవారం హోమంతో పాటు నూతనంగా తయారు చేసిన ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్టార్టర్ అపహరణ

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామంలోని హేమంత రాజుకు చెందిన పొలంలో సోమవారం రాత్రి స్టార్టర్ అపహరణకు గురైంది. ఈ మేరకు బాధిత రైతు హేమంతరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ ఎన్‌హెచ్ 44 పై రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డల్లప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితునితో పాటు ఎల్లకుంట్లకు చెందిన నాగిరెడ్డి పని నిమిత్తం బాగేపల్లికి వెళ్లి ద్విచక్ర వాహనం తిరిగి వెళ్తున్నారు. ఈ సమయంలోనే వారు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అనంతపురం వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీ కొంది. ఈ ఘటనలో డల్లప్పకు తీవ్ర గాయాలు కావడంతో తోటి కూలీలు చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి

మడకశిర: మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య కోరారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం చైతన్య మండలి మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. పీడీ మాట్లాడుతూ శిక్షణ పొందిన సభ్యులు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. సంఘాలు అనుసరించాల్సిన విధానాలను వివరించాలన్నారు. డీపీఎం రామ్మోహన్, ట్రైనర్లు అనురాధ, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెనుకొండ: ఏపీయూడబ్ల్యూజే పెనుకొండ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా టీవీ5 రిపోర్టర్ మధు ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక త్రిపురా రిసార్ట్‌లో జరిగిన సమావేశంలో మధుమోహన్‌తో పాటు ఉపాధ్యక్షుడిగా హరి, కార్యదర్శిగా మురళీధర్‌లను ఎన్నుకున్నారు. ప్రింట్ విలేకరుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఎన్నికను ఆపి వేశారు.

‘పురం’లో సంఘీభావ ర్యాలీ

హిందూపురం అర్బన్: రైతుల హక్కుల కోసం ఢిల్లీలో ఆమరణ దీక్ష చేస్తున్న రైతు సంఘం నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లైవాల్‌కు మద్దతుగా మంగళవారం పట్టణంలో వివిధ సంఘాలు నాయకులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ యూనైటెడ్ ఫ్రెంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్‌ఖాన్, రైతు సంఘం నాయకులు సోమశేఖర్ రెడ్డి, గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమానుల్లా, కదిరీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలు అరికట్టండి

పెనుకొండ రూరల్: తూకాల్లో మోసాలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆర్డీకో ఆనంద్ కుమార్‌కు రైతు సంఘం నాయకులు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. రిమోట్ ద్వారా స్కేళ్లను ఆపరేట్ చేస్తూ 6 కేజీల వరకూ దండుకొంటున్నారన్నారు. ఇలాంటి ఘటన సోమవారం పరిగిలో వెలుగు చూసిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

నాయకులు హరి, ఫకృద్దీన్, రమేష్, నాగరాజు, బాబావలి, మహబూబ్, ఆరిఫ్ పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకున్న రైతులు

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరు కావడానికి వెళుతున్న అధికారులను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు అడ్డుకున్నారు. తుంగోడు పొలం సర్వే నంబరు 28లో సాగులో ఉన్న రైతులు పట్టాల కోసం ఎన్ని అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కరించిన తర్వాత రెవెన్యూ సదస్సుకు వెళ్లాలన్నారు. గ్రామ పొలి మేరల్లో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిశేఖర్ వారికి హామీ ఇచ్చారు. వ్య.కా.సం. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలస్వామి, నాయకులు రత్నమ్మ, భాస్కర్, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కహాని పుస్తకం విడుదల

పెనుకొండ: పట్టణంలోని సీహెచ్‌ఎస్‌యూ కార్యాలయంలో మంగళవారం నమో ఆదాని కరెంట్ కహాని పుస్తకం విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరి, బాబావలి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర ఎన్నికల స్టంట్

పావగడ: స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ఆధ్వర్యంలో జేడీఎస్ నాయకులు సోమవారం చేపట్టిన పాదయాత్ర కేవలం ఎన్నికల స్టంట్ అని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే స్థానిక జెడ్పీ, టీపీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే పాదయాత్ర చేశారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు ఇచ్చిన 5 గ్యారంటీ పథకాలను అమలు చేసిందన్నారు.

జనవరి 30 నుంచి కెంచమాంబదేవి జాతర

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరులో వెలసిన కెంచమాంబదేవి జాతర ఉత్సవాలు జనవరి 30 నుంచి జరగనున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగానే జాతరకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నారు.

క్లుప్తంగా

క్రిస్మస్ శుభాకాంక్షలు


ఈరలక్కప్ప

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని క్రైస్తవులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఏసు చూపిన బాటలో నడవాలని.. శాంతి, సమాధానం, క్షమా గుణం కలిగి ఉండాలన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం


మాట్లాడుతున్న ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున

అగళి: పేదల జీవితాల్లో వెలుగులు నింపి వారి కళ్లల్లో ఆనందం చూడటం ఆర్డీటీ ధ్యేయమని ఆ సంస్థ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. మండల పరిధిలోని మంగళవారం రామపురం గొల్లహట్టిలో నిర్మించిన 17 గృహాలను ఏటీఎల్ ఓబులేసు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్పెయిన్ దేశస్తులు మాట్లాడుతూ ఆర్డీటీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మడకశిరరూరల్: మండల పరిధిలోని దిన్నెమీద పాళ్యం గ్రామ సమీపంలోని క్రాస్‌లో మంగళవారం ట్రాక్టర్ – కారు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారులో ఉన్న మహిళ స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన మహిళను వెంటనే మడకశిర ఆస్పత్రికి తరలించారు. మడకశిర వైపు నుంచి ట్రాక్టర్ వెళ్తుండగా అటు వైపు నుంచి వస్తున్న కారును ఢీ కొన్నట్లు స్థానికులు తెలిపారు.

అమరాపురం ఎస్‌ఐగా ఇషాక్ బాషా



అమరాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇషాక్ బాషా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గత ఆరు నెలల నుంచి ఎస్‌ఐ పోస్టు ఇక్కడ ఖాళీగా ఉంది. దీంతో ముదిగుబ్బ నుంచి అమరాపురం పోలీసుస్టేషన్‌కు ఇషాక్ బాషాను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానన్నారు. మండలంలోని ప్రజలు తమకు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ రామంజనేయులు, సిబ్బంది నూతన ఎస్‌ఐకి స్వాగతం పలికారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం



లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో గోందావళి సద్గురు బ్రహ్మ చైతన్య స్వామి ఆరాధన మహోత్సవంలో భాగంగా సీతారాముల బ్రహ్మ రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మచైతన్య ఆలయంలో ఏకాదశ వార రుద్రభిషేకం, గోమాత పూజ, సహస్రనామ పూజ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను బ్రహ్మరథంపై కొలువుదీర్చి జైశ్రీరాం అన్న భక్తుల నినాదాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. బస్టాండు వరకూ బ్రహ్మ రథోత్సవం సాగింది. గ్రామ పెద్దలతో పాటు గ్రామ సర్పంచ్ గంగరాజమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రూపుమాపే కుట్ర

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గంగిరెడ్డి

హిందూపురం టౌన్: ప్రపంచమే గౌరవిస్తున్న భారత రాజ్యాంగాన్ని రూపుమాపే కుట్రతోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అవమానపరిచే విధంగా మాట్లాడారని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, టిప్పు సుల్తాన్ యూనైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్, మాల మహానాడు మూర్తి, ఏపీ ఎంఎస్ఎఫ్ రవికుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్ వ్యాఖ్యలపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలందరూ స్పందించాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను మాత్రమే కాదు.. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, యావత్తు ప్రజలను అవమానించడమేనన్నారు. అమిత్ షా తక్షణమే దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పడంతో పాటు మంత్రి పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు వెంకట్, యంద్రమ్మ, గంగమ్మ, అనీత, కిష్టప్ప, చౌడప్ప, మధు పాల్గొన్నారు.

క్రిస్మస్ శోభ


హిందూపురం: చర్చి వద్ద క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేసిన దృశ్యం


పెనుకొండ: విద్యుత్ దీపాలంకరణలో సీఎస్‌ఐ మిషన్ చర్చి


హిందూపురంలోని బైబిల్ చర్చి

సాక్షిబృందం: క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్చిల వద్ద ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం నుంచే ప్రార్థనలు ప్రారంభంకానున్నాయి.


హిందూపురం: పాంచజన్య స్కూల్‌లో శాంతాక్లాజ్, ఏంజిల్స్ వేషధారణలో విద్యార్థులు


అలంకరణలో మడకశిరలోని ప్రార్థనా మందిరం